SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 250 | ఎడిటర్ : విక్రం కుమార్ | సోమవారం 19, మే 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

### పాక్ ప్రజల దైన్యం..

# ఆ దేశ సైన్యం!

- భక్షకులుగా మారుతున్న రక్షకులు

**మే 18, సమయం న్యూస్:** 'ప్రతి దేశానికీ ఒక సైన్యం ఉంది.. పాకిస్థాన్ సైన్యానికి మాత్రం ఒక దేశం ఉంది.'

ఆ దేశంలో అత్యంత శక్తిమంతమైన మిలిటరీ తీరుపై వచ్చే విశ్లేషణలివి. స్వార్థపరులైన సైనికాధికారులు ఆ దేశాన్ని కబ్జా చేసి, నిలువునా లూటీ చేస్తున్న తీరుకు ఇది దర్పణం పడుతోంది. ఈ సేనానులు చేసే పోరాటం తక్కువ.. డబ్బు కోసం ఆరాటం ఎక్కువ! ఆయుధాలను

తరువాయి 2లో






# 'పొగ'బట్టిన మృత్యువు

- చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో వ్యాపారి ఇంట్లో ఘోర అగ్నిప్రమాదం
- ఒకే కుటుంబంలోని 17 మంది మృత్యువాత
- మృతుల్లో 8 మంది పిల్లలు, నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు
- షార్ట్‌సర్క్యూట్ కారణమన్న అగ్నిమాపక శాఖ అధికారులు
- దుర్ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సీఎం దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రాష్ట్రం రూ. 5 లక్షలు, కేంద్రం రూ. 2 లక్షల చొప్పున పరిహారం
- ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశం

2లో

# పోడులోనూ... సిరులు!

- ఇందిరా సౌర గిరి జల వికాస పథకాన్ని నేడు ప్రారంభించనున్న సీఎం
- 6 లక్షల ఎకరాలకు సాగునీటి కల్పనే లక్ష్యం

**మే 18, సమయం న్యూస్ : హైదరాబాద్:** రాష్ట్రంలో పోడు భూములను వ్యవసాయ యోగ్యంగా తీర్చిదిద్ది, మెరుగైన ఉత్పాదకత సాధించేలా ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని అమలు



తరువాయి 2లో



### నకిలీ పేరుతో మోనికా బేడీకి

# పాస్‌పోర్టు

- కృష్ణమోహన్‌రెడ్డి తహసీల్దార్‌గా ఉన్నప్పుడే జారీ
- ఆయన ఇచ్చిన నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగానే మంజూరు
- అప్పట్లో కర్నూలు ఎస్పీగా పీఎస్ఆర్ ఆంజనేయులు
- వీరిద్దరూ అరెస్టై జైల్లో ఉన్న నేపథ్యంలో మరోమారు చర్చనీయాంశం

2లో





2లో

### పట్టుబడుతున్నారు..

# పారిపోతున్నారు!

- సైబర్ నేరాలు, మత్తుమందుల కేసుల్లో విచిత్ర పరిస్థితి

**మే 18, సమయం న్యూస్ , హైదరాబాద్:** పట్టుబడుతున్నారు.. బెయిల్‌తో పారిపోతున్నారు.. అజ్ఞాతంలోకి వెళ్లి మళ్లీ దందా మొదలు పెడుతున్నారు. ఇదీ అంతర్రాష్ట్ర నేరగాళ్ల తీరు. సవాళ్లెన్నో.. గత ఏడాది రాష్ట్రంలో మత్తుమందుల వాడకానికి సంబంధించి 1,942 కేసులు నమోదుకాగా 4,682 మందిని అరెస్టుచేశారు. సైబర్‌నేరాల కేసులు 24,643 నమోదైతే.. వీటిలో 19,653 నేరాల్లో 1,057 మందికి ప్రమేయం ఉందని గుర్తించారు. అందులో 186 మందిని అరెస్టుచేశారు. ఈ రెండు రకాల కేసుల్లోనూ అసలు సూత్రధారులు ఇతర రాష్ట్రాల్లో ఉంటారు. దీంతో వారిని పట్టుకోవడం

తరువాయి 2లో

### జ్యోతి మల్హోత్రా

# పూరీ ఎందుకు వచ్చింది?



### పథకం అమలులో కీలక పాత్ర

- లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల మంజూరులో అక్రమాలకు కృత్రిమ మేధతో అడ్డుకట్ట

**మే 18, సమయం న్యూస్ : గోపాలపూర్:** లక్షల్లో ఫాలోవర్లు ఉన్న కొందరు యూట్యూబర్ల వ్యవహార శైలి తీవ్ర అభ్యంతరకరంగా ఉంటోంది. తమ వ్యక్తిగత స్వార్థానికి దేశ ద్రోహానికి కూడా వెనుకాడడం లేదు. హరియాణాలోని హిస్సార్‌కు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా భారత రక్షణ రంగానికి చెందిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేసిన విషయం సంచలనం రేపింది. తాజాగా జ్యోతి మల్హోత్రాతో పూరీకి చెందిన మరో యూట్యూబర్ ప్రియాంక సేనాపతికి ఉన్న సంబంధంపై ఒడిశా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పాక్‌కు గూఢచర్యం కేసులో జ్యోతితోపాటు ఆమెకు సహకరించిన మరో ఆరుగురిని హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి సామాజిక మాధ్యమాల ఖాతాలను పరిశీలించగా, ఆమెకు ఒడిశాలోని పూరీకి చెందిన ప్రియాంకతో సన్నిహిత సంబంధాలున్నట్లు గుర్తించారు. ఆ విషయాన్ని పూరీ పోలీసు యంత్రాంగానికి తెలియజేయడంతో ఎస్పీ వినీత్ అగర్వాల్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 2024 సెప్టెంబరు 26న పూరీ వచ్చిన జ్యోతి.. ఇక్కడి శ్రీక్షేత్రాన్ని సందర్శించినట్లు తెలిసింది. స్థానికంగా ఓ హోటల్లో ఉన్న ఆమె దర్శనీయ ప్రాంతాలకు వెళ్లారు. ఆ సమయంలో ప్రియాంక

తరువాయి 2లో

# పరిపాలన సౌధంలో చక్కనమ్మలు



- సచివాలయాన్ని సందర్శించిన 107 దేశాల పోటీదారులు
- తెలంగాణ తల్లికి పుష్పార్చన.. రాష్ట్ర పథకాలపై డ్రోన్‌షో వీక్షణ
- అంతకు ముందు కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

**మే 18, సమయం న్యూస్, హైదరాబాద్:** రాజధానిలోని హుస్సేన్‌సాగర్ ఎదురుగా రాష్ట్ర పరిపాలన సౌధం.. ఆదివారం సాయంత్రం.. చిరుజల్లులతో కురిసిన వర్షం కాసేపటికి ఆగడంతో ఆహ్లాదకరంగా మారిన వాతావరణం.. ఈ సమయంలో సచి

తరువాయి 2లో

### సామాజిక మాధ్యమాలపై

# నియంత్రణ అవసరం



- వాటి వల్ల వ్యక్తిత్వ హననం పెరుగుతోంది
- భవిష్యత్తులో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

2లో

# 'పొగ' బట్టిన మృత్యువు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ చార్మినార్, చాంద్రాయణగుట్ట, కేశవగిరి, న్యూస్‌టుడే: చారిత్రక చార్మినార్ సాక్షిగా హైదరాబాద్ పాతబస్తీలో పెనువిషాదం చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో పొగ వ్యాపించి ఉక్కిరిబిక్కిరై ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన నగరాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఒకే అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులున్నారు. అపస్మారకస్థితికి చేరిన నలుగురు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ పెనువిషాదం గురించి తెలిసిన వెంటనే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, డీజీపీ జితేందర్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్రం రూ.2 లక్షల చొప్పున మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించాయి. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రకటించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాల బంధువులు, స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గుల్జార్‌హౌజ్ చౌరస్తాలో ముత్యాల వ్యాపారి ప్రహ్లాద్‌మోదీకి జీ+2 భవనం ఉంది. ఇందులో కింద పోర్షన్‌లో మూడు ముత్యాల దుకాణాలు ఉన్నాయి. పైరెండు అంతస్తుల్లోని ఎనిమిది గదుల్లో ప్రహ్లాద్‌మోదీ, ఆయన సోదరుడు రాజేంద్రకుమార్ మోదీ కుటుంబాలతోపాటు ప్రహ్లాద్‌మోదీ కుమారుడు పంకజ్‌మోదీ, అతని భార్య, ముగ్గురు పిల్లలు ఉంటున్నారు. వ్యాపార సముదాయం కావడం, ఇల్లు ఇరుకుగా మారడంతో అత్తాపూర్ ఉప్పర్‌పల్లిలో రెండు కుటుంబాలకు రెండు ఇళ్లను నిర్మించి ఆరు నెలల క్రితమే గృహప్రవేశం చేశారు. మరో రెండు నెల్లల్లో ఇంటీరియర్ పనులు పూర్తిచేసి అక్కడకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. ఇటీవల ప్రహ్లాద్‌మోదీ కాలికి గాయమై నడవలేని స్థితికి చేరారు. కొద్దిరోజుల క్రితమే అత్తాపూర్, రాజీవ్‌నగర్, బంజారాహిల్స్, సనత్‌నగర్‌లలో ఉంటున్న కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లను ఇంటికి రప్పించుకున్నారు. వేసవి సెలవులు కావడంతో అందరూ ఒక చోటికి చేరారు. శనివారం రాత్రి అత్తాపూర్‌లో జరిగిన ఓ వేడుకకు కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో 21 మంది కుటుంబ సభ్యులు గుల్జార్‌హౌజ్‌లోని ఇంటికి చేరారు. ఏసీలు ఆన్‌చేసి నిద్రలోకి జారుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో భవన ప్రవేశమార్గం వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. నెమ్మదిగా పైఅంతస్తుకు విస్తరించడంతో నాలుగు ఏసీల కంప్రెషర్లు ఒక్కసారిగా పేలి మంటలెచెలరేగాయి. కొద్ది సమయంలోనే దట్టమైన పొగ చుట్టుముట్టింది. కిటికీలు, తలుపులు మూసి ఉండటంతో గదులన్నీ పొగతో నిండిపోయాయి. అప్పటికే మేల్కొన్న ఇద్దరు మహిళలు గట్టిగా కేకలు వేస్తూ మిగిలిన వారిని అప్రమత్తం చేశారు. షట్టర్ తెరుచుకొని బయటకు వచ్చి 'బచావ్ బచావ్' అంటూ అరిచారు. ఎదురుగా ఉన్న గాజుల దుకాణం యజమాని ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పొగవస్తున్నట్లు గమనించి పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేశారు. ఈలోగా మరికొందరు యువకులతో కలిసి ఆయన సహాయక చర్యలను చేపట్టారు. 11 ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు ప్రమాద ప్రాంతానికి చేరాయి. అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి, నగర కొత్వాల్ సీవీ ఆనంద్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహ్రా ఘటనాస్థలానికి వచ్చారు.

**ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి**

చుట్టూ మంటలు, దట్టమైన పొగతో ప్రమాదంలో చిక్కుకున్న 21 మంది ఊపిరాడక విలవిల్లాడారు. బాధితుల్లో ఒకే గదిలో ఉన్న 11 మంది పొగ కారణంగా శ్వాస ఆడక... అపస్మారకస్థితికి చేరుకున్నారు. మిగిలిన గదుల్లో ఉన్న వారు బయటకు వచ్చే ప్రయత్నంలో మెట్ల వద్ద కుప్పకూలిపోయారు. కిటికీలు, తలుపులు మూసి ఉండటంతో తప్పించుకునే అవకాశం లేకపోయింది. స్థానికులు గోడలకు రంధ్రాలు చేసి కొందర్ని బయటకు తీసుకొచ్చారు. ఇంతలో రంగంలోకి దిగిన అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. తీవ్రమైన పొగతో ముందుకెళ్లడం కష్టంగా మారడం, లోపలంతా చీకటిగా ఉండటంతో బాధితులను గుర్తించేందుకు శ్రమించాల్సి వచ్చింది. ముగ్గురు బాధితులు అక్కడికక్కడే అసువులుబాసారు. అపస్మారక స్థితికి చేరిన మిగిలిన వారిని 108 వాహనాల్లో హైదర్‌గూడ, డీఆర్‌డీవో అపోలో, యశోద, ఉస్మానియా, నాంపల్లి కేర్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ప్రహ్లాద్‌మోదీ(73), ఆయన భార్య మున్నీబాయి(70), రాజేంద్రకుమార్‌మోదీ(65), ఆయన భార్య సుమిత్ర(60), ప్రహ్లాద్‌మోదీ కుమారుడు పంకజ్(40), కోడలు వర్ష(38)...వీరి పిల్లలు అన్యమోదీ(11), ఇదికామోదీ(8), ఇరాజ్(2), ప్రహ్లాద్‌మోదీ కూతుళ్లు శీతల్‌జైన్(37), రజనీ అగర్వాల్(47), శీతల్‌జైన్ కుమారుడు రిషబ్‌జైన్(13), కుమార్తె ఆరుషి జైన్(17), బంధువుల కుటుంబానికి చెందిన ప్రశాంత్ అగర్వాల్(6), అద్వాలి గుప్త(7), అభిషేక్‌మోదీ(40), ప్రథమ్ అగర్వాల్(14) మృత్యువాతపడ్డారు.. టెర్రస్‌పైకి చేరిన నలుగురు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీరిలో ఆశ, గురియా పేర్లు బయటకు వచ్చాయి. మిగిలిన ఇద్దరు ఎవరనేది పోలీసులు ఆరా తీస్తున్నారు.

## పట్టుబడుతున్నారు.. పారిపోతున్నారు!

(మొదటిపేజీ తరువాయి)

కష్టంగా మారింది. ఇక ఆన్‌లైన్‌ద్వారా జరిగే సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో నేరగాళ్లను గుర్తించడమే కష్టమవుతోంది. ఒకవేళ గుర్తించినా అరెస్టు చేయడం ఇంకో పెద్దసవాల్. మత్తుమందుల కేసుల్లో గోవా, ముంబయి, బెంగళూరు, దిల్లీ వంటి ప్రాంతాల్లో మకాం వేసిన నైజీరియా దేశస్థులు అక్కడున్న స్థానికులద్వారా తెలంగాణలోకి మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నారు. మత్తుమందులు రాష్ట్రంలోకి వచ్చినప్పుడు నిఘావేసి పోలీసులు పట్టుకుంటున్నారు. చాలా సందర్భాల్లో ఇక్కడ పట్టుబడుతున్నవారికి మత్తుమందులు ఎవరు పంపారో కూడా తెలియదు. ఒకవేళ తెలిసినా ఆయా రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకోవడం సవాల్‌గా మారింది. సైబర్ నేరాలదీ ఇదేతీరు. నేరస్థులు రాజస్థాన్, ఝార్ఖండ్, దిల్లీ తదితర రాష్ట్రాల్లో ఉండి ఆన్‌లైన్‌ద్వారా దోచుకుంటున్నారు. బాధితులు ఫిర్యాదు ఇచ్చేవరకూ జరిగిన మోసం తెలియడం లేదు. తర్వాత దర్యాప్తు మొదలుపెట్టి నేరగాళ్లను గుర్తించడం, అరెస్టు చేయడం మరో సవాల్. అందుకే గత ఏడాది 186 మంది మాత్రమే అరెస్టయ్యారు. గత ఏడాది సైబర్ సెక్యూరిటీ బ్యూరో అంతర్రాష్ట్ర దాడుల్లో ఒకేసారి 27 మందిని అరెస్టు చేశారు. ఇక ఇతర రాష్ట్రాల్లో పట్టుబడి, వారు తెలంగాణలో కూడా నేరాలు చేసినట్లు గుర్తిస్తే అలాంటివారిని పీటీ వారెంటుపై ఇక్కడకు తీసుకొస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్ చేస్తున్నారు. కానీ ఒకసారి వీరికి బెయిల్‌వచ్చిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో నిందితులు బెయిల్ పొందేలోపే అభియోగపత్రాలు దాఖలుచేసి న్యాయవిచారణ మొదలు పెట్టించడం.. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ, బెయిల్‌పై వెళుతున్న నిందితుల మీద కన్నేసి ఉంచడం.. ఈ రెండింటికీ ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.

## పరిపాలన సౌధంలో చక్కనమ్మలు

(మొదటిపేజీ తరువాయి)



(మొదటిపేజీ తరువాయి)

వాలయంలో అడుగుపెట్టిన ప్రపంచదేశాల సుందరీమణులు 2 గంటలపాటు సందడి చేశారు. ఫొటోషూట్‌లో 'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ నినదించారు. తెలంగాణ తల్లికి పుష్పార్చన చేశారు. తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించిన డ్రోన్‌షోను వీక్షించి అబ్బురపడ్డారు.

**ఘనస్వాగతం పలికి..**

ప్రత్యేక బస్సుల్లో 5.40 గంటలకు సచివాలయానికి చేరుకున్న మిస్‌వరల్డ్ పోటీదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వారిని స్వాగతించారు. సచివాలయ భవనం ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికపైకి ఎక్కి అభివాదం చేశారు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' గేయాన్ని వినిపిస్తుండగా తెలంగాణ తల్లి విగ్రహానికి మిస్ వరల్డ్ ఇండియా నందినిగుప్తా సహా శ్రీలంక, సింగపూర్, మలేసియా, నేపాల్, ఇండోనేసియా, ట్యునీసియా సహా 10 దేశాలకు చెందినవారు పుష్పాంజలి ఘటించారు. సచివాలయం లోపలి ప్రాంగణంలో వారికి రాష్ట్ర ప్రభుత్వం తేనేటి విందును ఏర్పాటుచేసింది. మంత్రి జూపల్లి, హైదరాబాద్ నగర ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు. జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల అభీష్టం మేరకు తమ ప్రభుత్వం పరిపాలన చేస్తోందన్నారు.

## జ్యోతి మల్హోత్రా పూరీ ఎందుకు వచ్చింది?

(మొదటిపేజీ తరువాయి)

ఆమెతో కలిసి తిరిగారు. శ్రీక్షేత్రంపై ఉగ్రవాదుల కళ్లున్నాయని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం ఉంది. ఈ పరిస్థితిలో జ్యోతి జగన్నాథస్వామి దర్శనానికి వచ్చారా? లేక రెక్కీ చేసి, పాక్‌కు ఏదైనా సమాచారం అందించారా? అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పాక్‌లోని కర్తార్‌పుర్ సందర్శించి..**

ప్రియాంక మూడు నెలల క్రితం పాకిస్థాన్‌లోని కర్తార్‌పుర్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో ఆమె ఆ దేశానికి ఎందుకు వెళ్లారు? అక్కడ ఏం చేశారు? ఎవరెవర్ని కలిశారు? అన్న అంశాలు కీలకంగా మారాయి. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రియాంక ఆదివారం వివరణ ఇచ్చారు. 'జ్యోతి మల్హోత్రా పాక్ గూఢచారిణి అని నాకు తెలియదు. పూరీ వచ్చిన ఆమెను స్నేహితురాలిగా భావించి, కలిసిమెలిసి తిరిగా. నేను పాకిస్థాన్‌కు విహారయాత్ర కోసం వెళ్లా. అంతకుమించి ఏమీ లేదు. పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తా' అని పేర్కొన్నారు. ప్రియాంక తండ్రి రాజ్‌కిశోర్ సేనాపతి కూడా అదే విషయాన్ని విలేకర్లకు చెప్పారు. హరియాణా పోలీసులతో కలిసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వినీత్ పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఇప్పుడే చెప్పలేమన్నారు. దర్యాప్తు కొలిక్కి వచ్చేవరకు ప్రియాంకను పూరీ విడిచి వెళ్లరాదన్న పోలీసులు.. సైబర్ నిపుణులతో కలిసి సదరు యూట్యూబర్ వీడియోలను శోధిస్తున్నట్లు తెలిసింది.

## నకిలీ పేరుతో మోనికా బేడీకి పాస్‌పోర్టు

అమరావతి, కర్నూలు: రెండున్నర దశాబ్దాల క్రితం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన అండర్ వరల్డ్ మాఫియా డాన్ అబూసలేం ప్రియురాలు, సినీనటి మోనికా బేడీకి నకిలీ పేరుతో పాస్‌పోర్టు జారీ చేసిన వ్యవహారం... మద్యం కుంభకోణం కేసులో తాజాగా అరెస్టైన జగన్ ఓఎస్డీ పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి కర్నూలు తహసీల్దార్‌గా ఉన్నప్పుడే జరిగింది. సనా మాలిక్ కమల్ పేరిట మోనికా బేడీకి 2001 ఏప్రిల్ 9న నివాస ధ్రువీకరణపత్రాన్ని ఆయనే జారీచేశారు. కర్నూలులోని బాబూ గౌండ వీధిలో నివాసం ఉంటున్నట్లు తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దాన్ని అడ్డం పెట్టుకునే మోనికా బేడీ పాస్‌పోర్టు పొందగలిగారు. తన ప్రియుడు, 1993 నాటి ముంబయి పేలుళ్ల ఘటనలో కీలక పాత్రధారి, దేశద్రోహానికి సంబంధించి పలు కేసుల్లో అభియోగాలున్న అబూ సలేంతో కలిసి 2002లో పోర్చుగల్‌కు పారిపోయి, అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. ఆ తర్వాత తీగ లాగితే కర్నూలు కేంద్రంగానే ఈ నకిలీ పాస్‌పోర్టుల తయారీకి బీజం పడినట్లు వెలుగుచూసింది. తొలుత కర్నూలు పోలీసులు కేసు నమోదు చేయగా.. తర్వాత సీబీఐ రంగంలోకి దిగింది. కృష్ణమోహన్‌రెడ్డిని విచారించింది. నాటి ఆర్ఐ మహ్మద్ యూనిస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా నివాస ధ్రువపత్రం జారీ చేశానంటూ కృష్ణమోహన్‌రెడ్డి ఆ కేసులో తప్పించుకుని సాక్షిగా మారారు. ఇప్పుడు మద్యం కుంభకోణం కేసులో జైలుకెళ్లారు.

* ఈ నకిలీ పాస్‌పోర్టు జారీ అయిన సమయంలో పీఎస్ఆర్ ఆంజనేయులు కర్నూలు జిల్లా ఎస్పీగా ఉన్నారు. క్షేత్రస్థాయి తనిఖీ అధికారులిచ్చిన నివేదికల ఆధారంగా సనా మాలిక్ కమల్ పేరిట పాస్‌పోర్టు జారీకి అప్పట్లో ఆయనే నిరభ్యంతర పత్రమిచ్చారు. ఆంజనేయులు తర్వాత కర్నూలు ఎస్పీగా ఎన్. సంజయ్ వచ్చారు. ఆయన హయాంలో 2002 ఆగస్టులో ఈ నకిలీ పాస్‌పోర్టుల వ్యవహారం వెలుగుచూసింది. కేసులో కఠినంగా వ్యవహరించలేకపోయారని, కీలక నిందితులు విదేశాలకు పారిపోయినా గుర్తించలేకపోయారనే ఆరోపణలు, విమర్శలు సంజయ్‌పై ఉన్నాయి.
* పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రస్తుతం ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ కేసులో అరెస్టై జైల్లో ఉన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగాధిపతి, అగ్నిమాపక శాఖ డీజీ హోదాల్లో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సంజయ్‌పై ఏసీబీ కొన్నాళ్ల క్రితం కేసు పెట్టింది. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారు. కృష్ణమోహన్‌రెడ్డి తాజాగా అరెస్టైన నేపథ్యంలో.. 2001, 2002లో జరిగిన ఈ పాస్‌పోర్టుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది.
* ఈ కేసులో మాఫియా డాన్ అబూసలేం, మోనికా బేడీతో పాటు అప్పటి కర్నూలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ యూనిస్, ఏఎస్సై సత్తార్ సహా మరికొందర్ని దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారందరికీ శిక్షలు విధించింది.

## పోడులోనూ సిరులు!

(మొదటిపేజీ తరువాయి)

చేయబోతోంది. తద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇందుకోసం రానున్న ఐదేళ్లలో రూ.12,600 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ పథకాన్ని సోమవారం (ఈ నెల 19న) నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణానికి (2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు) పోడుపట్టాలు మంజూరయ్యాయి. ఇందులో విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే.. సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాదికి పథకం అమలు కార్యాచరణను గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) ఖరారు చేసింది. ఈ నెల 25 వరకు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించి, జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన, భూగర్భ జలాల సర్వే తదితర పనుల్ని గిరిజన సంక్షేమశాఖ చేపడుతుంది. జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనుల్ని పూర్తి చేస్తారు. తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చుచేయనున్నారు.

## సామాజిక మాధ్యమాలపై నియంత్రణ అవసరం

హైదరాబాద్, యూసుఫ్‌గూడ, : సామాజిక మాధ్యమాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. వీటి ద్వారా వ్యక్తిత్వ హననం చేస్తున్న ఘటనలు ఎక్కువవుతున్నాయని, నియంత్రించకుంటే ఇళ్లల్లోని మహిళలను కూడా దూషించే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. 'తెలుగువన్' సంస్థ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ సంస్థ అధినేత రవిశంకర్ కంఠంనేని ఆధ్వర్యం వహించిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ.. 'ఒకప్పుడు గ్రామాలకు వార్తాపత్రికలు కూడా వచ్చేవికావు. ఆకాశవాణి ద్వారానే వార్తలు వినేవాళ్లం. ఏ నాయకుడు అసెంబ్లీలో బాగా మాట్లాడుతున్నారో ఆ కొద్ది సమయంలోనే విని, ప్రజలు బేరీజు వేసుకునేవాళ్లు. తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. ప్రస్తుతం వందల ఛానళ్లు పుట్టుకువచ్చాయి. అదొక మార్పు' అని చెప్పారు. 'సామాజిక మాధ్యమం ద్వారా ఎన్ని లాభాలున్నాయో.. అంతమేర నష్టాలూ ఉన్నాయి. వ్యక్తిత్వ హననం చేసే మాధ్యమాన్ని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది' అని పేర్కొన్నారు.

**మోస్ట్ లివబుల్ సిటీ హైదరాబాద్**

'ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా భారతీయులుంటారు. వారిలో అధిక శాతం తెలుగువారే. గతంలో మేము ముందుచూపుతో చేసిన కృషివల్లే ఇది సాధ్యమైంది. హైదరాబాద్.. ప్రస్తుతం 'మోస్ట్ లివబుల్ సిటీ'. ఇందుకు 1995 నుంచి 2000 సంవత్సరం వరకు పక్కాగా ప్రణాళికలు రచించాం. ప్రస్తుతం 'క్వాంటమ్ వ్యాలీ విత్ ఏఐ' అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. భవిష్యత్తులో తెలుగువారు.. నాలెడ్జ్‌లో అగ్రస్థానంలో ఉండాలి. వ్యాపారవేత్తలుగానూ ఎదగాలి' అని ఆయన ఆకాంక్షించారు. తెలుగుజాతి క్రియేటివ్ ఎకానమీకి మారుపేరుగా మారుతోంది. భవిష్యత్తులో అమరావతి క్రియేటివ్ ఎకానమీకి చిరునామాగా నిలుస్తుంది. 'ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారు. 'వికసిత్ భారత్' నినాదంతో 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థానంలో మన దేశం ఉంటుంది. భవిష్యత్తులో ప్రపంచంలోని టాప్ సిటీల్లో మొదటి, రెండు స్థానాల్లో అమరావతి, హైదరాబాద్ ఉంటాయి' అని చంద్రబాబు అన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు హైదరాబాద్ ఐటీ ఉద్యోగులు పోరాడిన విధానాన్ని జీవితంలో మరచిపోలేనన్నారు. ఎన్ని జన్మలెత్తినా తెలుగు వ్యక్తిగానే పుట్టాలని అనుకుంటున్నానని చంద్రబాబు తెలిపారు.

**అత్యంత ప్రాచీనమైనది.. తెలుగు**

'తెలుగు అత్యంత ప్రాచీనమైనది. ఏ భాషలోనూ కావ్యాలు లేని రోజుల్లో.. వెయ్యేళ్ల క్రితమే తెలుగులో మహాభారతాన్ని రచించారు' అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్‌స్వామి తెలిపారు. ఈ సందర్భంగా 'తెలుగువన్' పురస్కారాలు అందుకున్న వారికి ఏపీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, వేణుగోపాలచారి, సినీరంగ ప్రముఖులు మురళీమోహన్, ఆర్. నారాయణమూర్తి, తనికెళ్ల భరణి, సుద్దాల అశోక్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

## పాక్ ప్రజల దైన్యం.. ఆ దేశ సైన్యం!

(మొదటిపేజీ తరువాయి)

పక్కనపెట్టేసి.. నయానో భయానో భూములను హస్తగతం చేసుకొని, వ్యాపార సామ్రాజ్యాలు నడుపుతూ వీరు సాగిస్తున్న దందాతో దేశం దివాళా అంచుకు చేరింది. ఈ జనరళ్లు కోట్లకు పడగలెత్తారు. పోరాటం చేసే బాధ్యతను ఉగ్రవాదులకు అప్పగించేసి రాజప్రాసాదాలను తలపించే భవనాల్లో విలాసాల్లో జోగుతున్నారు. మరోవైపు సాధారణ పాక్ ప్రజలు కనీస అవసరాలు తీరే దిక్కులేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారత్‌ను బూచిగా చూపుతూ పాకిస్థాన్‌ను అక్కడి సైన్యం కబంధ హస్తాల్లో బిగించింది. సైనిక ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి ఆ దేశాన్ని ప్రత్యక్షంగా పాలించారు. మిగతా సమయంలోనూ వారిదే పెత్తనం. ప్రజాస్వామ్య ప్రభుత్వం అక్కడ నామమాత్రం.

**విలాపం**

దీర్ఘకాల రాజకీయ అనిశ్చితి, అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణ కారణంగా పాకిస్థాన్ నలిగిపోతోంది. అధిక ధరలు, ఆర్థిక సంక్షోభం వల్ల సగటు పాక్ జాతీయుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విదేశీ అప్పు 126 బిలియన్ డాలర్లు దాటిపోయింది. అప్పులు తీర్చడానికి దేశ బడ్జెట్‌లో 40 శాతం సొమ్ము సరిపోతోంది. ఆకలి సూచీలో పాక్ ఎక్కడో అట్టడుగున ఉంది. దేశ జనాభాలో దాదాపు 40 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. బలోచిస్థాన్‌లో పరిస్థితి మరీ దారుణం. సహజవాయువు, ఖనిజాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ రాష్ట్రం తోడ్పాటును అందిస్తున్నప్పటికీ అక్కడ 70 శాతం మంది పేదరికంలో ఉన్నారు. ఇది వేర్పాటువాద ఉద్యమాలకు ఊతమిస్తోంది. పాక్‌లో గత కొన్నేళ్లుగా ఆర్థిక వృద్ధిరేటు 2.4 శాతానికే పరిమితమైంది. విదేశీ మారకనిల్వలు దారుణంగా పడిపోయాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇచ్చే ఉద్దీపన ప్యాకేజీలు, కొన్ని దేశాలు ఇస్తున్న రుణాలతో పాక్ నెట్టుకొస్తోంది.

**విలాసం..**

దేశ ప్రజలు ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే.. ఒక వ్యవస్థ ప్రస్థానం మాత్రం నిత్య కల్యాణం..పచ్చతోరణంలా సాగిపోతోంది. అదే ఆ దేశ సైన్యం! ఇది ఒట్టి మిలిటరీ శక్తి మాత్రమే కాదు.. తిరుగులేని కార్పొరేట్ సంస్థ. రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్, అగ్రిబిజినెస్, తయారీ, మీడియా, సరకుల రవాణా వంటి కీలక రంగాల్లో భారీగా ఆర్జిస్తోంది. ప్రత్యేక మినహాయింపులు, భూ ఆర్డినెన్స్‌ల ద్వారా ఈ దందాను చట్టబద్ధం చేసుకుంది. ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతోంది.

# నిజాం కాలం నాటి నక్షాలకు మోక్షం

* వచ్చే వారం నుండి ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలలో రీ సర్వే
* రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ మే 18 ( సమయం న్యూస్) : తెలంగాణ రాష్ట్రం లో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించబోతున్నామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో తర తరాలుగా నిజాం కాలం నుండి సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని గత పది సంవత్సరాలలో ఈ సమస్యకు ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు గాను 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫీడ్ బ్యాక్ ను బట్టి మిగిలిన గ్రామాల్లో కూడా చేపడతామని తెలిపారు.

* పైలెట్ గ్రామాలు

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్ , జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ , ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు మంత్రి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో



భాగంగా ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్దతులలో విస్తృత సర్వే జరుగుతుందని, ఏరియల్/డ్రోన్ సర్వే పద్దతి, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్దతుల్లో సర్వే చేసి జియో రిఫరెన్డ్స్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారుచేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుంది, ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రీ సర్వే కోసం వివిధ రాష్ట్రాలలో రీ సర్వే లో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసి టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. పైలట్ గ్రామాల్లో ఈ సంస్థలు రీ సర్వే చేస్తాయని, సర్వే ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాలకు విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని వాడుకుని శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



## సీసీ కెమెరాలు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట, మే18 (సమయం న్యూస్) : అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్స్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి వీధిలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, స్థానిక బస్తి ప్రజలు పాల్గొన్నారు

## అగ్నిప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్ పాతబస్తీలో అగ్నిప్రమాద మరణాల పట్ల కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడడం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర సంతాపం ప్రకటించారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలని, మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం చేసి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నిత్యం అప్రమత్తంగా ఉంటూ,



ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## హైదరాబాద్ అగ్ని ప్రమాదం పైన
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డీటెయిల్డ్ ప్రకటన

హైదరాబాద్ మే18( సమయం న్యూస్) : హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్‌కు, బాధకు గురయ్యాను. ఈ విషాద ఘటన చాలా హృదయవిదారకంగా ఉంది.ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ అగ్నిప్రమాదం త్వరగా అదుపులోకి రావాలని ఆశిస్తూ, ప్రార్థిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఈ సంక్షోభ సమయంలో అవసరమైన ఏ సహాయానికైనా అందుబాటులో ఉంటాయి. ఈ ఘటనలో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి పనిచేస్తారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రమాద స్థలం వద్ద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించిన కేటీఆర్ ప్రభుత్వం ఈ అగ్నిప్రమాదానికి కారణాలను లోతుగా విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్న కేటీఆర్ బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఓల్డ్ సిటీతో పాటు హైదరాబాద్ నగరంలో అగ్ని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, అగ్నిమాపక శాఖ సామర్థ్యాన్ని పెంచాలని సూచిస్తున్నాము. ఈ విషాద సమయంలో హైదరాబాద్ ప్రజలందరూ ఐక్యంగా నిలిచి, బాధితులకు అండగా ఉండాలని విజ్ఞప్తి.



## గుల్జార్‌హౌస్ ఘటన.. పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్: చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ''ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు చెబుతున్నారు. ఉదయం 6.16 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే 6.17కి మొగల్‌పుర ఫైర్ ఇంజిన్ సిబ్బంది బయలుదేరి 6.20గంటలకు ప్రమాదస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. ఈక్రమంలో మొత్తం 11 ఫైర్ ఇంజిన్లతోపాటు ఒక రోబోను ఉపయోగించారు. 70 మంది ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నియంత్రించగలిగారు. ఈ ఘటన జరగడం అత్యంత దురదృష్టకరం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది'' అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

## హెలిప్యాడ్ ద్వారా పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కాళేశ్వరం మే18( సమయం న్యూస్) : ఆదివారం కాళేశ్వరంలో జాయ్ రైడ్ ద్వారా సరస్వతి పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కరీంనగర్ సిపి గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్. ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జాయ్ రైడ్ ద్వారా సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్‌లు,



రహదారి సదుపాయాలు, శానిటేషన్, శుద్ధీకరణ చర్యలు, టెంట్ సిటి, స్టాళ్లు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు జాయ్ రైడ్ హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు ప్రక్కల అడవులు తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## భక్తుల కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

* జిల్లా కలెక్టర్ రావుల శర్మ

కాళేశ్వరం మే18, ( సమయం న్యూస్) : ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి ఘాట్, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించు త్రివేణి సంగమం, ఆరోగ్య శిభిరం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం, పుష్కర విధులు నిర్వహించు సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన శాల తదితర ప్రాంతాలల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నదని, రేపటి వరకు అదనంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పుష్కర స్నానానికి భక్తులు వెళ్లేందుకు అదనంగా తాత్కాలిక రహదారి వేయాలని తెలిపారు. భక్తులు వ్యర్థాలు వేసేందుకు అదనంగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని డిపిఓ ను ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తులను ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. సంగమ ప్రాంగణం మొత్తం డర్టీగా ఉందని, సాయంత్రం మళ్ళీ వస్తాను అప్పటీ వరకు మొత్తం పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సంగమ ప్రాంతంలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, డిపిఓకు వాకిటాక్ ద్వారా సూచించారు. పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని అదనపు సిబ్బంది ఏర్పాటు ద్వారా వ్యర్థాలను తొలగించాలని మళ్ళీ వస్తాను మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. భక్తుల రద్దీ పెరుగుతున్నదని దేవస్థానంలో స్వామి దర్శనానికి క్యూ లో ఉన్న భక్తులను



దర్శనానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు దర్శనం త్వరగా అయ్యేలా చూడాలని దేవస్థానం సిబ్బందిని ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మంచినీళ్లు అందించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



ఆదివారం పుష్ప గిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సభినవోద్దండ విద్యాశంకర భారతీ మహస్వామి వారు పుష్కర స్నానం ఆచరించి. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని భక్తులకు ఆశీర్వచనం అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఆర్జేసి రామ కృష్ణారావు, ఈఓ మహేష్, ఆలయ చైర్మన్ మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఖేడ్ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థికి సన్మానం






నారాయణఖేడ్, 18 మే, (సమయం న్యూస్): ఈరోజు హైదరాబాద్‌లోజరిగిన ఇక్రా గ్రూప్ ఆఫ్ డాక్టర్ హైదరాబాద్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐ కేర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ చారిటేబుల్ ట్రస్టు వారు తెలంగాణలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంపిక చేసి సన్మానించారు.అందులోసంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ ముజమ్మిల్ 600 గాను 562 మార్కులు సాధించినందుకు ఇక్రా గ్రూప్ ఆఫ్ డాక్టర్ హైదరాబాద్ ట్రస్టు వారు సర్టిఫికేట్ తో సన్మానించడం జరిగింది.ఈ విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాములు మరియు పాఠశాల సిబ్బంది అభినందించారు. కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక   తెలుగు దినపత్రిక



# నాలుగో రోజూ కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

కాళేశ్వరం మే18 (సమయం న్యూస్) : పుష్కరాలకు తరలి వస్తున్న భక్తులు .. జనసంద్రంగా మారింది కాళేశ్వరం.. కారులన్ని కాళేశ్వరం వైపే త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చత్రియాయుధం త్రిజన్మపాపసంహారం ఏకబిల్వం శివార్పణం. త్రిలింగ క్షేత్రం, త్రివేణి సంగమ తీరానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సరస్వతి పుష్కరాల్లో 4వ రోజు ఆదివారం ఉదయం నుండే లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్త జనం కాళేశ్వరం క్షేత్రానికి చేరుకున్నారు. శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో ఎదురైన ఇబ్బందులు తిరిగి పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాల రాకపోకలు సాగాయి.

**సైకత లింగాలు...**

సరస్వతి అంతర్వాహిని నది పుష్కరాలను పురస్కరించుకని భక్తులు త్రివేణి సంగమ తీరాన పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం గంగమ్మ ఒడిలో జంగమయ్యను ఆరాధిస్తున్నారు. సైకత లింగాలను తయారు చేసుకున్న భక్తులు శివ నామస్మరణలో చేస్తూ భక్తిని చాటుకుంటున్నారు. నది తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించిన తరువాత నదీ తీరంలోనే సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించే ఆనవాయితీని పాటిస్తారు. అనంతరం త్రివేణి సంగమాన్ని పూజించి దీపారాధన చేసి గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆ తరువాత సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకాశిల సరస్వతి మాతను, శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామిని, శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకుంటున్నారు. ఆధ్యాత్మికతతో ఉట్టిపడుతున్న త్రివేణి సంగమ తీరం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది.

**మొంటెల వాయినం...**



పుష్కరుడు సంచరించే వేళ ముత్తయిదలు మొంటెల వాయినం మొక్కులు తీర్చుకుంటున్నారు. సుభాషిణీలకు సాంప్రాదాయ బద్దమైన ఆచారంలో భాగంగా మొంటెల వాయినాలు ఇస్తూ దీర్ఘ సుమంగలిగా ఉండేలా దీవెనలు అందుకుంటున్నారు.

**ఏరియల్ సర్వే...**

త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. గగనంలో సంచరిస్తూ నది తీరం, వాహనాలు రాకపోకలతో పాటు ఏర్పాట్లు తదితర సేవలను పర్యవేక్షించారు.



## ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

* **అందుబాటులో ఉండి : సేవలందించాలి కలెక్టర్**
* **ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ప్రజలు వినియోగించుకోవాలి***
* **వార్డులు, గదుల పరిశీలన, అందిస్తున్న సేవలపై ఆరా**
* **మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

జిల్లాలోని ప్రజలందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నీ కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలోని పలు వార్డులు, ప్రసూతి విభాగం, వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలువురు బాలింతలతో మాట్లాడారు. ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక పరిశీలించారు. ప్రతి రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారని? గత నెలలో మొత్తం ఎంత మంది వచ్చారు? అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# కొనుగోలు లో రికార్డ్ చిటకోడూరు కేంద్రం

* **గత సీజన్ లో కమిషనర్ ఇచ్చిన సూచనలతో ఈసారి సమస్య లకు చెక్**
* **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం మే18(సమయం న్యూస్): ఆరుగాలం శ్రమించి కష్టపడి సాగు చేసే రైతులకు అండగా ఉండి.. వారు పండించిన ధాన్యం కి మద్దతు ధర ఇస్తూ.. కేంద్రాలకి వచ్చే ప్రతీ గింజను కొనుగోలు చేయాలి అన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా.. జిల్లా లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యలకు గాను.. ఐకేపీ, పి ఏ సి ఎస్ కలిపి మొత్తం 258 కొనుగోలు కేంద్రాలని ఏర్పాటు చేసి...సజావుగా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. జిల్లా లోని అన్ని కేంద్రాలలో కంటే స్థానిక మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన చీటకోడూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఈసారి సీజన్ లో రికార్డ్ సృష్టించిందన్నారు. గత సంవత్సరం రబీ సీజన్ లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి. ఎస్ చౌహాన్ జిల్లాలోని పెంబర్తి, నెల్లుట్ల, మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన చీటకోడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలని సందర్శించారని ...అక్కడ ఉత్పన్నమైన సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారని.. ఆ సమస్య లు మళ్ళీ ఎదురుకాకుండా తీసుకోవలిసిన జాగ్రత్త లను, చేపట్టాలిసిన చర్యలను అధికారులకు కమిషనర్ వివరించారన్నారు. కమిషనర్ ఇచ్చిన సూచనలు, సలహాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి సీజన్ లో కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా... ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లా లో సాఫిగా సాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. చీటకోడూరు కొనుగోలు కేంద్రం కి సంబందించి...రబి సీజన్ 2023 2024 సంవత్సరం లో 177 మంది రైతుల వద్ద నుండి 11104 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా ... ఖరీఫ్ 2024 25 సంవత్సరం లో 192 మంది రైతుల నుండి 12990క్వింటాళ్ల అలాగే రబి 202425 సంవత్సరం లో 497 మంది రైతుల నుండి ఇప్పటి వరకు 38104 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడం వల్ల జిల్లా లో అత్యధికముగా ధాన్యం కొనుగోలు చేసిన కేంద్రం గా రికార్డు సృష్టించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా రైతులు పండించిన ప్రతీ గింజ ను కోనేంత వరకు అధికారులు పర్యవేక్షణ చేస్తూ... సాఫిగా కొనుగోలు ప్రక్రియ ముగిసే వరకు అకాల వర్షాలకు అప్రమత్తం గా ఉంటు... రైతులకు అండగా ఉండాలని కలెక్టర్ జిల్లా యంత్రాంగానికి సూచించారు.



## సాలూరు ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

* **2003-04 బ్యాచ్ ఘనంగా నిర్వహణ**

బోధన్ నియోజకవర్గం, మే 18, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం సాలూరు మండలంలోని సాలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2003 2004 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 21 సంవత్సరాల అనంతరం తిరిగి ఒక్కటై ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం 2025 మే 18 ఆదివారం రోజున పాఠశాల ఆవరణలో ఎంతో హర్షాతిరేకంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాకు మార్గదర్శకులుగా ఉన్న ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, మనోహర్, మరియు సాలూరు మండల ఎంఈఓ రాజీ మంజూష హాజరై, తమ ఆశీస్సులు అందించారు. ఈ వేడుకలో పాఠశాల ప్రస్తుత ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుంటూ, తమ అనుభవాలను పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. మా జీవితాల్లో మలుపు తిప్పిన ఈ పాఠశాల గురువులకు, ముఖ్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ కు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామనీ అన్నారు. అనంతరం ఈ ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన విద్యార్థులందరూ కలిసి తమ గురువులను ఎంఈఓ ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం, సాలూరు ప్రభుత్వ పాఠశాల, నిజామాబాద్ విద్యా సంఘటనలు వంటి కీవర్డ్‌తో ఈ కథనం రీచ్ పెరుగుతుంది.



# అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ లైట్ నిర్వహణ



హనుమకొండ మే 18 (సమయం న్యూస్): "అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే"సందర్భంగా ఈరోజు సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హనుమకొండ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల హనుమకొండ నుండి ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ వరకు కొవ్వొత్తులు వెలిగించి అవగాహన ర్యాలీ అనంతరం సంఘీభావ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్యగారు మాట్లాడుతూ ఎయిడ్స్ తో మరణించిన వారిని స్మరించుకుంటూ,ప్రజలలో హెచ్ఐవి , ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగించడం ,అలాగే ఎవరైతే హెచ్ఐవి వ్యాధితో జీవిస్తున్నారో వారికి , వారి కుటుంబ సభ్యులకు సంఘీభావంగా సపోర్టుగా ఉండేందుకు, కోసం ఈ కార్యక్రమం 1983 నుండి నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఐవి అవగాహన,నియంత్రణలో ,పునరావాసం లో ప్రభుత్వ విభాగాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ,NSS విబాగం, కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరు HIV ,AIDS పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అవగాహన కలిగిస్తూ స్క్రీనింగ్ శాతాన్ని పెంచాలని, హెచ్ఐవి నిర్ధారణ అయినవారు ఎఆర్టి మందులు క్రమం తప్పకుండా వాడాలని వారికి ఫాలోఅప్ సేవలు అందించాలని సూచించారు. అడిషనల్ డిఎమ్ హెచ్ ఓ డాక్టర్ టి మదన్మోహన్రావు గారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ,టీబీ ఆసుపత్రి మరియు సిఎస్సి పరకాల లో ఐసిటిసి సెంటర్లు పనిచేస్తున్నాయని, ప్రతి పీహెచ్సీ లో HIV టెస్టింగ్ సదుపాయం అందుబాటులో ఉందని ,అలాగే మొబైల్ వాహనం ద్వారా టెస్టింగ్ మరియు కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని , టీబీ ఆసుపత్రిలో ఉన్న సంపూర్ణ సురక్ష కేంద్రం ద్వారా అవగాహన కార్యక్రమములు ,టెస్టింగ్ మరియు వైద్య శిబిరములు నిర్వహించడం జరుగుతున్నది అన్నారు అలాగే ఐదు స్వచ్ఛంద సంస్థలు హెచ్ఐవి నియంత్రణలో భాగస్వాములుగా పనిచేస్తున్నారన్నారు. 202425 లో 55,000 పరీక్షించగా 100 పాజిటివ్ లు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ గీతజిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ స్వప్న మాధురి ఐసీటీసి సూపర్వైజర్, రామకృష్ణ, కమలాకర్ పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం జి ఎం హెచ్ ఆరోగ్య సిబ్బంది , ఐ సి టి సి కౌన్సిలర్లు రాపర్తి సురేష్, రాజేందర్ , సంపూర్ణసురక్షకేంద్రం బృందం,ఇక్బాల్ భాషల్యాబ్ టెక్నీషియన్లు కరుణా మైత్రి పాజిటివ్ నెట్వర్క్ రవీందర్,మారి విజయ మోహన్ ట్రకర్స్ నవ్య,వర్ద గోవర్ధన్, కరునా మైతిరి, Rdmm ఈశ్వర్, YRG care లింక్ వర్కర్స్ నుండి ముస్తాక్,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ,సూపర్వైజర్లు ఆశాలు పాల్గొన్నారు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ద్వారా అన్ని పత్రికలలో ప్రచురణార్థం సమర్పించనైనది.




## బాల్య వివాహన్ని అడ్డుకున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, చైల్డ్ లైన్

హనుమకొండ మే 18(సమయం న్యూస్): ఆదివారం సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాయంపేట ప్రాంతంలో కళ్యాణ మండపంలో మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లుగా పోలీసులకు అందిన సమాచారంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం పోలీసులు, చైల్డ్ లైన్ అధికారులు సంయుక్తంగా బాల్య వివాహం జరుగుతున్న ప్రాంతానికి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకొని మైనర్లయిన బాల బాలికను రక్షించి.. ఇరువురు మైనర్ల తల్లిదండ్రులను సి. డబ్ల్యూ.సి ముందు హాజరు పరిచి,తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

## రేపు (సోమవారం) ప్రజావాణి రద్దు

* **జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాద్ మే 18, (సమయం న్యూస్) : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు, రవాణా, సంబంధిత అంశాలపై జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో నిమగ్నమై ఉంటారు. కాబట్టి అధికారులందరూ అందుబాటులో ఉండకపోవడంతో రేపు అనగా 19న (సోమవారం) ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించగలరని కోరుతూ వినతులతో కలెక్టరేట్ కు రావొద్దని వెల్లడించారు.

# రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

* **రైతులు ఎటువంటి ప్రలోభాలకు గురికావొద్దు**
* **అనవసర వదంతులు నమ్మవద్దు**

తొర్రూరు మే 18(సమయం న్యూస్) : జిల్లా యంత్రాంగమంతా రైతులకు అండగా ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ. ప్రేమ్ కుమార్, డీఎం సీఎస్ కృష్ణవేణి పేర్కొన్నారు. ఆదివారం, జిల్లాలోని తొర్రూరు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, లతో కలిసి (ప్రెస్ మీట్) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ. ప్రేమ్ కుమార్, డీఎం సీఎస్ కృష్ణవేణి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యాసంగి 202425 కాలానికి సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు లక్షా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని, గత రబీ సీజన్ తో పోలిస్తే ఈసారి ధాన్యం సేకరణ మూడింతల దిగుబడి పెరిగిందని, ఇప్పటివరకు జిల్లాలో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నిత్యం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ధాన్యం సేకరణ, తరలింపును సమర్థవంతంగా నిర్వహించడానికి



18 మండలాల తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని, కానీ రైతులు కొంత మంది స్వార్థపరుల, వ్యక్తిగత రాజకీయాల వదంతులను నమ్మి ధర్నాలకు ఉపక్రమిస్తున్నారన్నారని, దీని వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదన్నారు. తొర్రూరు మండలం ఔతాపురం, తొర్రూరు, అమ్మాపురంలలో రైతులు ధర్నా చేపట్టారని, ఈ సెంటర్లో ప్రతి రోజు లారీలు పెట్టినప్పటికీ రైతులు అదనపు లారీలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా లారీలను కూడా ఎప్పటికప్పుడు సమకూరుస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచుల సమాచారం పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో తరలించి రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు జరగడం వల్ల రైతులకు వేగవంతంగా నగదు చెల్లింపులు చేస్తున్నామని, కేంద్రానికి వచ్చే ప్రతి గింజ కొనడం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలని కలెక్టర్ నిరంతరం సమీక్షలతో ఆదేశిస్తున్నారన్నారు. కాగా, ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 25889 మంది రైతుల నుంచి సన్న ధాన్యం లక్షా 7 వేలు మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 26475 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 173 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. ఇదే సీజన్ లో గత ఏడు 202324 సంవత్సరంలో 33850 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 202425 సంవత్సరంలో ఇప్పటివరకు చూసుకుంటే గణనీయంగా లక్షా 27 వేల 224 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇంకా తేమ శాతం రాని ధాన్యం కేంద్రాల్లో ఉందని, వాటికి సంబంధించిన కొనుగోళ్ల ప్రక్రియ కూడా పూర్తయితే కొనుగోలులో మరింత వృద్ధి నమోదు అవుతుందని వెల్లడించారు. అధికార యంత్రాంగం ఈ దిశగా రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణంలో చోటు చేసుకునే మార్పులను తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నామని, ధాన్యం కూడా ఎక్కడ తడవకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. జిల్లాలో ఇంకా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, దానికి అనుగుణంగా 56 వేల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉందని, గోనె సంచులు కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా అందుబాటులో ఉన్నాయని, కావున రైతులు ఎలాంటి చెందాల్సిన అవసరం లేదని, కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యం, అక్రమాల గురించి మా దృష్టికి వచ్చిందని, అలాంటి కొనుగోలు కేంద్రాలను గుర్తించడం జరిగిందని, వాటి మీద దర్యాప్తు చేసి బాధ్యులపై ఖచ్చితంగా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## హెచ్ బి కాలనీలో... కె ఎస్ ఎన్ అయ్యంగార్ భవన్ హోటల్ ప్రారంభం

కాప్రా, మే 18 (సమయం న్యూస్) : సుచి, శుభ్రత ,నిజాయితే వ్యాపారానికి ఆభరణాలు అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం హెచ్ బి కాలనీ కృష్ణానగర్ లో... కొత్తగా ఏర్పాటుచేసిన కె ఎస్ ఎన్ అయ్యంగార్ భవన్ హోటల్ ను మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హోటల్ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. శుచి, శుభ్రత పాటిస్తూ రుచికరమైన భోజనాన్ని అందజేస్తే హోటల్ వ్యాపారం వృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు కె ఎస్ నారాయణ, ఎన్ కృష్ణ కుమార్, కే గోవింద్ నారాయన్, సుకన్య మాట్లాడుతూ... కార్పొరేట్ స్థాయిలో 20వేల మందికి శాకాహార భోజనాలను క్యాటరింగ్ చేయగల స్థాయిలో హోటల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2011లో ప్రారంభమైన తమ హోటల్లు హైదరాబాద్ నగరంలో కొత్తగా ప్రారంభించినట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా మరిన్ని శాఖలను త్వరలో తెరుస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జయంత్, సంతోష్, వర్మ, కృష్ణానగర్ కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాలను నాశనం చేసే డంప్ యార్డు మాకు వద్దు

* **సిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి**

గుమ్మడిదల, మే 18,సమయం న్యూస్ : ప్రజల జీవితాలను నాశనం చేసే డంప్ యార్డు మాకొద్దని సిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. డంప్ యార్డుకు నిరసనగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారా నగర్, నల్లవల్లి గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 103వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు పలువురు నాయకులు ,సామాజిక కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఎలాంటి ప్రాజెక్టు




తీసుకొచ్చినప్పటికీ అది ప్రజాభిప్రాయ మేరకే ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. డంప్ యార్డు నిర్మాణం పర్యావరణానికి హానికరం కావడంతో స్థానిక ప్రజలు ఆరోగ్యాలు ప్రమాదంలోకి పడే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ కోసం పచ్చని అడవిని, ప్రజల నివాస ప్రాంతాలను ఎంచుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.ప్రజలు 103 రోజులుగా శాంతియుతంగా చేస్తున్న రిలేనిరాహార దీక్షలను అధికారులు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. ఇకనైనా తక్షణమే ప్రజాభిప్రాయం మేరకు డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షులు సదానంద రెడ్డి, దేవేందర్ రెడ్డి, సూర్యనారాయణ, చక్రపాణి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవన్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయండి

* **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

సంగారెడ్డి మే 18(సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మించబోయే జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆర్ &బి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , రోడ్లు మరియు భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. 2.5 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో డి ఈ, ఆర్ అండ్ బి రామకృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు ప్రముఖులకు

# శ్రీ గురు పీఠం ప్రాణ ప్రతిష్ట ఆహ్వాన పత్రిక అందజేత

* **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్**

శివంపేట్ మే 18 (సమయం న్యూస్) : కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేక్ , పద్మా దేవేందర్ రెడ్డి తాజా మాజి ఉపసభావతి , మాజీ అటవి శాఖ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి గారిని, మాజీ శాసనసభ్యులు ఏనుగు రెవెన్యూ రవీందర్ రెడ్డి , తాజామాజి మున్సిపల్ చైర్మన్ కొంపల్లి శ్రీశైలం యాదవ్ , రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు



కల్లూరి హనుమంతరావు , ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త, శ్రీ శ్రీనివాస్ గౌడ్ మీనాక్షి సిమెంట్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త, శంకరంపేట జడ్పిటిసి, తదితరులను కలిసి శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ శ్రీ జిన్నారం పెద్దగొని శివకుమార్ గౌడ్ , ట్రస్టు సభ్యులు బారాస. శివంపేట మండల అధ్యక్షులు రాజా రమణ గౌడ్ , తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ,గౌర్రె వెంకట్ రెడ్డి తాజా మాజీ ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్, జూన్ 5న జరిగే శ్రీ దత్తాత్రేయ మహా స్వామి మరియు శ్రీ షిరిడి సాయిబాబా ప్రాణ ప్రతిష్ట పూజ ఆహ్వాన పత్రికను అందజేసి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ప్రజాపతినిధులను ఆహ్వానించడం జరిగింది. అందరు ఆహ్వానానికి ప్రతిస్పందనగా తప్పకుండా వస్తామని చెప్పారు.



## విజయనగరంలో విషాదం.. కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి

విజయనగరం రూరల్: విజయనగరం కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఎంతసేపైనా తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు. సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత.. లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు.వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోధించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

## బావిలోకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురి మృతి

పీలేరు: అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలమువారిపల్లి వద్ద కారు బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన శివన్న, లోకేశ్, గంగులయ్య, సునీల్, తిప్పారెడ్డి అనే వ్యక్తులు పీలేరులో జరుగుతున్న క్యాటరింగ్ పనులకు బయలుదేరారు. ఆదివారం వేకువ జామున పీలేరు మండలం బాలమువారిపల్లె వ్యవసాయ పొలాల సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సునీల్, తిప్పారెడ్డి ప్రాణాలతో బయటపడగా.. శివన్న, లోకేశ్, గంగులయ్య మృతిచెందారు. ఈమేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దేవాలయాలు మన సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతిబింబాలు

* **శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాధవానంద సరస్వతి స్వామి**



గుమ్మడిదల ,మే18, సమయం న్యూస్ : దేవాలయాలు మన సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతిబింబాలని, భక్తులు ఇక్కడి దేవాలయాన్ని నిత్యం దర్శించి ఆధ్యాత్మికంగా వృద్ధి చెందాలని మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని నల్లవల్లి గ్రామంలో ఆదివారం శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాధవానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో, గ్రామ పురోహితులు ఆంజనేయశర్మ గారి ఆధ్వర్యంలో, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆలేటి జగన్మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి ,గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, నిర్వహించి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభారోహణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పటాన్చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కొలను బాల్ రెడ్డి, సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,లలితా నరసింహారెడ్డి, ఆంజనేయులు ,రాజశేఖర్, వేణు ,దేవేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పొంచి ఉన్న ప్రమాదం పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

జిన్నారం, మే 18, సమయం న్యూస్ : జిన్నారం మండలం ఊట్ల, దాదిగూడెం గ్రామ సరిహద్దు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారిలో ట్రాన్స్ఫార్మర్ దగ్గర కరెంట్ స్తంభం విరిగి ఉందని గ్రామస్తులు తెలిపారు. ఏ క్షణానైనా స్తంభం కింద పడే ప్రమాదం ఉందని వారన్నారు. విద్యుత్ అధికారులు గత పది రోజుల నుండి స్తంభం విరిగి ఉన్న పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. ఇకనైనా విద్యుత్ అధికారులు ఈ విద్యుత్ స్తంభాన్ని మార్చి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుకున్నారు.

## వర్ని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన

# గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతి రెడ్డి రాజారెడ్డి








బోధన్ డివిజన్, మే 18, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతీ రెడ్డి రాజారెడ్డి ఆదివారం బోధన్ డివిజన్ వర్ని మండలంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో జరుగుతున్న నిర్వహణ, పాఠక సేవల పరంగా చేపట్టిన కార్యక్రమాలు, విభాగాల నిర్వహణను సమీక్షించారు. విద్యార్థులకు విద్య పఠన ప్రోత్సహించే విధంగా అందుబాటులో ఉన్న వనరులు, గ్రంథాలయ వసతులు, పాఠకుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు పై చైర్మన్ పర్యవేక్షించారు. పాఠకులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. వర్ని శాఖా గ్రంథాలయంలో భవన అభివృద్ధి, మరమ్మతులు, పాఠక అనుకూల సౌకర్యాలు కల్పించినందుకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కు పాఠకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ చైర్మన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





## శ్రీ మారుతి మందిర దుకాణాల బహిరంగ లీజు వేలం ప్రకటన

బోధన్ పట్టణం, మే 18, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నుండి నర్సి కి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన పట్టణంలోని శ్రీ మారుతి మందిర ఆలయం పరిధిలో ఉన్న 2 దుకాణాల లీజు హక్కుల కోసం బహిరంగ వేలం ప్రకటన విడుదలైంది. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ & దేవాదాయ శాఖ జి.ఓ.ఎం. ఎస్. నెం. 866 ప్రకారం, ఈ రెండు దుకాణాలను రెండు సంవత్సరాల కాలపరిమితితో అద్దెకు ఇవ్వాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ వేలం ప్రక్రియ 23052025 న శుక్రవారం రోజున ఉదయం 11:00 గంటలకు ఆలయ ఆవరణలో జరగనుంది. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు శ్రీ మారుతి మందిరం కార్యాలయంలో నియమ నిబంధనలు సంబంధిత వివరాలు పొందుపరచడం జరిగిందని, వాటిని పరిశీలించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రాములు, ఆలయ చైర్మన్ గుండేటి శంకర్, మరియు ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

# జ్యోతి మల్హోత్రాను 'అస్త్రం'గా మలచుకొని..?

పాకిస్థాన్‌కు గూఢచారిగా వ్యవ హరించిందన్న ఆరోపణలపై హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణ క్రమంలో అధికారులు కీలక విషయాలు రాబడుతున్నారు. మల్హోత్రాను ఓ అస్త్రంగా పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లు మలచుకున్నట్లు హరియాణా పోలీసులు గుర్తించారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' సమయంలో దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని ఓ అధికారితో ఆమె టచ్‌లో ఉన్నట్లు నిర్ధరించారు

* **ఇన్‌ఫ్లుయెన్సర్లను అస్త్రంగా మలచుకొని..**

"జ్యోతి మల్హోత్రా సైనిక లేదా రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన సమా చారం వారితో పంచుకుందని ఈ దశలో చెప్పలేం. కానీ, పాక్ నిఘా వర్గాలతో ఆమె నేరుగా సంప్రదింపులు జరిపారు. వాళ్లు మల్హోత్రాను ఓ అస్త్రంగా చేసుకున్నారని కచ్చితంగా చెప్పగలం. ఇతర యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్లతోనూ ఆమె టచ్‌లో ఉన్నారు.



వాళ్లు కూడా పీఐవోలతో సంప్రదింపులు జరుపుతున్నారు" అని హిసార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావర్ తెలిపారు. ఇది కూడా ఓ రకమైన యుద్ధమేనని, ఇన్‌ఫ్లుయెన్సర్లను నియమించుకుంటూ.. వారి ప్రయత్నాలను అమలు చేస్తారన్నారు.

**పాకిస్థాన్‌కు పలుసార్లు..**

జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌లో పలు మార్లు పర్యటించిందని, ఓసారి చైనాకూ వెళ్లి వచ్చినట్లు హరియాణా పోలీసులు వెల్లడించారు. ఇటీవల బహిష్కరణకు గురైన పాక్ అధికారితోనూ ఆమె టచ్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు విశ్లేషిస్తున్నామని, ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది? అనే విషయాలను కనుగొనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆమె ల్యాప్‌టాప్ సహా ఎలక్ట్రానిక్ పరికరాలపై ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తామని, ఏం సమాచారం పంచుకుందనే విషయం అప్పుడు స్పష్టమవుతుందన్నారు. ఈ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలతోనూ తాము సంప్రదింపులు కొన సాగిస్తున్నామని చెప్పారు.



## దేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం దక్కింది: పురందేశ్వరి

రాజమహేంద్రవరం : ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ కుతంత్రాలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన బృందాల్లో ఏపీ భాజపా అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి చోటు కల్పించారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 33 దేశాల రాజధానులకు వెళ్లేందుకు వివిధ పార్టీలకు చెందిన మొత్తం 59 మందితో ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యుకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించే ఎనిమిది మంది సభ్యుల బృందంలో ఎంపీ పురందేశ్వరి ఉన్నారు. ఈ బృందానికి భాజపా సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి వారు వివరిస్తారు. అనేక సంవత్సరాలుగా భారతదేశాన్ని దెబ్బతీసేందుకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్ బుద్ధిని ప్రపంచం ముందు బయటపెట్టడానికి, మనదేశంపై పాకిస్థాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందంలో తనకు చోటు దక్కడం ఆనందంగా ఉందని ఎంపీ పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదులను ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు, పౌరులకు నివాళులు అర్పించడానికి ఇదొక చిన్న

# హైదరాబాద్‌లో భారీ పేలుళ్లకు కుట్ర.. భగ్నం చేసిన పోలీసులు

హైదరాబాద్‌లో భారీ పేలుళ్లను పోలీసులు భగ్నం చేశారు. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్.. నగరంలో పేలుళ్లకు కుట్ర పన్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ సంచలన ఆపరేషన్ చేసింది. నగరంలో విధ్వంసాలకు కుట్ర చేసిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ , సయ్యద్ సమీర్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు దుండగులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. "పేలుళ్లకు ఎవరు ప్లాన్ చేశారు. ఎందుకు చేస్తున్నారు. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రదారి ఎవరు?. అసలు కారణాల ఏంటి, ఉగ్రవాదులతో సంబంధాలున్నాయా..?." అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్ తర్వాత జరిగిన పరిణామాలతో ఉగ్రవాదుల పేర్లు వింటేనే జనం హడలిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఉగ్రమూలాలు ఉన్నాయని ఇప్పటికే తేలింది. గతంలోనూ హైదరాబాద్‌లో ఉగ్రవాదులు పేలుళ్లు జరిపి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. దీంతో తాజాగా హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర చేస్తున్నారని తెలియడంతో నగర వాసుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఇద్దరేనా.. ఇంకెవరైనా ఉన్నారా అనే ఆందోళన కొనసాగుతోంది. ఉగ్రమూకలను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం చాలా పటిష్ఠంగా,



అలర్ట్‌గా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దుండగుల విచారణ తర్వాత పూర్తి వివరాలు వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో జరిగే ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మొద్దని, ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులు సూచించారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్.. రేపు ఆగస్టు నెల టికెట్లు విడుదల..

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తిరుమల కొండకు చేరుకొని భక్తి శ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ప్రతి నెలా ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవ, దర్శన టికెట్లు, వసతి గదుల కోటాను విడుదల చేస్తుంది. ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారి భక్తులకు ఆగస్టు నెల కోటా ఆర్జిత సేవా టికెట్లను టీటీడీ రేపు (సోమవారం) ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. అలాగే ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల(మే) 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మే 24న ఉదయం 10 గంటలకు ఆగస్టు నెల ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లను విడుదల చేయనుంది. జులై నెల శ్రీవారి సేవ, పరకామణి సేవ, నవనీత సేవా టికెట్లు మే 29న ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు టీటీడీ(TTD) అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in/home/dashboard సందర్శించండి. వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.



తిరుమలకు వెళ్లే భక్తులు ఈ విషయాన్ని గుర్తించి దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.




# వదులైనా ఫ్యాషనే..!

లూజ్ డ్రెస్ వేసుకోమంటే అమ్మాయిల రియాక్షన్ ఎలా ఉంటుంది? ఎవరిదో అరువు తెచ్చుకుని వేసుకున్నట్టే భావిస్తారు కదూ! ఇది నిన్న మొన్నటి మాట. ఇప్పటి తరాన్ని అడగండి... 'ఓవర్ సైజ్డ్', 'బ్యాగీ' ఫ్యాషన్ అంటూ ఎంచక్కా వేసేసుకుంటారు. జెన్ జీ పఠించే మంత్రమే అది... సౌకర్యానికే వారి తొలి ప్రాధాన్యం. అలాగని ఎలా ఉన్నా వేసుకుంటారు అనుకునేరు. ఆ ఓవర్‌సైజ్‌కే స్టైలిష్‌లుక్ తెచ్చేస్తున్నారు. కాబట్టే, సాదాగా కనిపించే పెద్ద సైజు టీ షర్టులు, షర్టులు ఇదిగో ఇలా ఫ్యాషన్‌లా మారిపోతున్నాయి. అందుకే సినీతారలూ వీటిని అనుసరించేస్తున్నారు. స్కర్ట్, జెగ్గింగ్, జీన్స్... దేనికైనా ఇవి నప్పేస్తున్నాయి. షర్టు ఒకవైపు మడిచినా, టీ షర్టు ముడేసినా, చేతులు కాస్త ముడిచినా... ఏం చేసినా కొత్తగా కనిపించడం, తమదైన స్టైల్ స్టేట్‌మెంట్‌లా కనిపించడం ఖాయం. అందుకే ఆఫీసు, పార్టీ, ప్రయాణం ఎక్కడికైనా బ్యాగీ ఫ్యాషన్‌కే ఓటేస్తున్నారు అమ్మాయిలు. మీరూ అంతేనా? అయితే మీ స్టైల్ స్టేట్‌మెంట్ ఏది మరి?







## అమ్మాయిలూ...
# ఇలా చేసి చూడండి!

స్త్రీల శరీర నిర్మాణం ఎంతో ప్రత్యేకం. రుతుచక్రం కారణంగా హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఉంటుంటాయి. దాంతో మూడ్స్ మారుతుంటాయి. వాటికి సరైన ఆహార నియమాల్ని పాటించకపోతే రకరకాల మానసిక, ప్రత్యుత్పత్తి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి వాటిని పాటించే తీరాలి. అవేమంటే...

**ఆహారం, నిద్ర, వ్యాయామం!**

* తినే ప్రతి భోజనంలో కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు... అన్నీ ఉండేలా చూసుకోవాలి. ప్రాసెస్డ్ స్నాక్స్‌కి దూరంగా ఉండాలి.
* రసాయనాలతో కూడిన కాస్మెటిక్స్‌నీ ప్లాస్టిక్ వస్తువుల్నీ వాడకపోవడం మేలు. వీటిల్లోని రసాయనాలు సహజ హార్మోన్ల ఉత్పత్తిని అడ్డుకుంటాయి.
* యోగా, వాకింగ్, తేలికపాటి వ్యాయామాల్ని అలవాటు చేసుకుంటే ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ శాతం తగ్గుతుంది.
* మెగ్నీషియం, బివిటమిన్లు, ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు, జింక్... వంటివి హార్మోన్లను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఆయా పోషకాలు ఉన్న ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి.

**పొట్ట జాగ్రత్త**

ఏది మిగిలితే అది తినడం. పొట్ట గురించి అస్సలు పట్టించుకోకపోవడం... మహిళలు చేసే అతి పెద్ద పొరబాటు. అటు మెదడునీ, ఇటు హార్మోన్ల వ్యవస్థనీ అనుసంధానం చేస్తూ ప్రభావితం చేసేది పొట్టనే. తేన్పులు, నిద్ర పట్టకపోవడం, చికాకు, దురద వంటి సమస్యలు తరచూ వస్తున్నాయంటే మీ పొట్ట సరిగా లేదని అర్థం. కాబట్టి తినేవాటిమీద ఓ కన్నేయండి. చక్కెర, అధిక ఉప్పు పదార్థాల్ని దూరం పెట్టండి. ఇడ్లీ, దోశ, పెరుగు, కంజి... వంటి ప్రొబయోటిక్ ఫుడ్స్‌ని ఎక్కువగా తీసుకోండి. ఆహారాన్ని నమిలి తినాలి. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే హార్మోన్ల వ్యవస్థ బాగా పనిచేస్తుంది. ఆనందాన్ని కలిగించే సెరటోనిన్‌లో అధిక శాతం పొట్టలోనే ఉత్పత్తి అవుతుంది. అంటే మీ భావోద్వేగాలు తినే ఆహారం మీదే ఆధారపడి ఉంటాయని అస్సలు మర్చిపోవద్దు.

**జీవగడియారం!**



ఆలస్యంగా నిద్రపోవడం అర్ధరాత్రి తినడం... వంటివన్నీ జీవగడియారాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి నిద్రపోవడానికి కనీసం గంట ముందే స్క్రీన్‌కి దూరంగా ఉండండి. అప్పుడే మెలటోనిన్ ఉత్పత్తి అయి మంచి నిద్ర పడుతుంది. వీలైనంత త్వరగా డిన్నర్ ముగించండి.

**పరీక్షలు**

అలసట, మూడ్ స్వింగ్స్, నీరసం, జుట్టు రాలిపోవడం, నెలసరి సమయానికి రాకపోవడం... వంటివి ఉంటుంటే పోషకలోపం అని గుర్తించాలి. ఇందుకోసం ఐరన్, బి12, విటమిన్‌డి, థైరాయిడ్ పరీక్షల్ని ఏడాదికోసారి చేయించుకుంటే సగం సమస్యలు తగ్గిపోతాయి. ఇలా చేయించుకోవడం మీ పుట్టినరోజుకి మీకు మీరు ఇచ్చుకునే కానుకగా భావించండి. ఇవన్నీ తప్పక పాటిస్తే మీ ఆరోగ్యం మీ చేతిలో ఉన్నట్లే.



# చాక్లెట్ మసాజ్‌తో..!

చర్మం ప్రకాశవంతంగా మెరవాలన్నా, నిర్జీవమైపోయిన చర్మాన్ని తిరిగి పునరుత్తేజితం చేయాలన్నా అది శరీరంలో రక్తప్రసరణ సరిగ్గా జరగడం వల్లనే సాధ్యమవుతుంది. అందుకు చాక్లెట్ మసాజ్ చక్కగా తోడ్పడుతుంది. స్పా ట్రీట్‌మెంట్లలో భాగంగా చేసే ఈ మసాజ్‌లో డార్క్ చాక్లెట్‌తో పాటు ఏదో ఒక అత్యవసర నూనెని కూడా కలుపుతారు. ఈ మిశ్రమంతో శరీరమంతా మర్దన చేయడం ద్వారా శరీరంలోని అవయవాలన్నింటికీ రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది. తద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అంతేకాదు.. చాక్లెట్‌లోని కొకోవా శరీరంలో ఎండార్ఫిన్లు విడుదల చేస్తుంది. అవి చర్మం కింద దాగున్న కొవ్వుల్ని కరిగించడంలో సహకరిస్తాయి. ప్రత్యేకించి పొడిబారిపోయి నిర్జీవమైన శరీరాన్ని తిరిగి పునరుత్తేజితం చేయడానికి, కండరాల నొప్పుల్ని తగ్గించడానికి కూడా ఈ మసాజ్ చక్కగా ఉపయోగపడుతుంది అంటున్నారు నిపుణులు. అలాగే ఇలా మసాజ్ చేసే క్రమంలో మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందట.

**మలినాల్ని తొలగించడానికి..**

వాతావరణంలోని దుమ్ము, ధూళి చర్మపు రంధ్రాల్లో చేరిపోయి మొటిమలు, మచ్చలు వంటివి ఏర్పడుతుంటాయి. అత్యవసర నూనెలతో మసాజ్ చేయించుకోవడం వల్ల అవి తొలిగే అవకాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల చర్మపు రంధ్రాల్లో ఇరుక్కుపోయిన దుమ్ము, ధూళి అవశేషాలు మెత్తబడి త్వరగా వదిలిపోయే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. ఇలా చేయడం వల్ల కండరాల నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. మర్దన చేసే క్రమంలో మనసుకూ హాయిగా ఉంటుంది అంటున్నారు నిపుణులు.






# కౌంట్‌డౌన్ స్టార్ట్




మంచు విష్ణు హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'కన్నప్ప'. జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ ఈ సినిమాపై మంచి హైప్‌ని క్రియేట్ చేశాయి. ప్రమోషన్ కార్యక్రమాలు కూడా ప్రారంభించిన విష్ణు అమెరికాలో అక్కడ ప్రేక్షకుల మధ్య సినిమా ప్రచారం మొదలు పెట్టారు. ఇటీవల ఈ మూవీ నుంచి చివరి మూడో ఎపిసోడ్ యానిమేటెడ్ సిరీస్‌ను సైతం విడుదల చేసిన మేకర్స్.. తాజాగా పరమ శివుడు పాత్రధారి అక్షయ్ కుమార్ పూర్తి లుక్‌ను రిలీజ్ చేశారు. ఇంకా 40 రోజులే ఉందంటూ క్యాప్షన్ ఇచ్చారు. ముకేశ్ కుమార్‌సింగ్ ఈ మూవీకి దర్శకత్వం వహించగా.. ప్రీతి ముకుందన్ హీరోయిన్. మోహన్ బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు కీలక పాత్రలో నటిస్తున్నారు.

# ఆ నైట్ కోసం రెడీ



ఇండియన్‌ఫిల్మ్ ఇండస్ట్రీలో మోస్ట్‌ఐకానిక్ హీరోయిన్లలో తమన్నా భాటియా ఒకరు. సిల్వర్‌స్క్రీన్, వెలుపల కూడా ఆకట్టుకుంటూనే ఉంటుంది ఆ ముద్దుగుమ్మ. తెలుగు, తమిళం, హిందీలో దాదాపు 85 చిత్రాల్లో నటించి చిత్ర పరిశ్రమలో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. మల్టీ టాలెంటెడ్‌కు పేరుగాంచిన ఈ మిల్క్‌బ్యూటీ.. ఇప్పటికే రెండు సంతోషం ఫిల్మ్ అవార్డులు, ఒక సైమా, కలైమామణి అవార్డుతో సహా అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకుంది. ఇండస్ట్రీలో అద్భుతమైన ఈ జర్నీ ఆమెను తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్లలో ఒకరిగా చేసింది. ఓ వైపు సినిమాలు, సిరీస్‌లు చేస్తూనే మరోవైపు స్పెషల్ సాంగ్స్‌లోనూ ఆడిపాడుతోంది ఈ భామ. రీసెంట్‌గా ఓదెల 2 మూవీలోనూ మెరిసింది. రైడ్ 2లో స్పెషల్‌సాంగ్‌తో ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ ఫ్యాన్స్‌కు దగ్గరవుతూ ఉంటుంది తమన్నా. తాజాగా ఈ మిల్క్‌బ్యూటీ ఇన్‌స్టాలో కొన్నిస్టన్నింగ్ ఫొటోస్ షేర్ చేసింది. బ్లాక్‌డ్రెస్‌లో మత్తెక్కించే అందాలతో మెరిసిపోతుంది. మిల్క్‌బ్యూటీ సొగసులు.. డీప్‌నెక్‌గౌన్‌లో క్యూట్ లుక్స్‌తో మెస్మరైజ్ చేస్తోంది. జీ సినీ అవార్డ్స్‌కోసం ముస్తాబైన ఈ లుక్‌లో అదిరిపోయింది. ఈపిక్స్‌కు 'ఆడియన్స్‌కు డెడికేట్‌చేసిన ఆ నైట్ కోసం' అంటూ క్యాప్షన్‌ఇచ్చింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముద్దుగా ఉందంటూ ఫ్యాన్స్‌కామెంట్లు పెడుతున్నారు.

# ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం.. జూన్ నుంచి థియేటర్లు బంద్



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. ఎగ్జిబిటర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య పర్సంటేజీలపై చాలా కాలంగా చర్చ కొనసాగుతోంది. అద్దెల రూపంలోసినిమాలను ప్రదర్శించడం సాధ్యంకాదని ఎగ్జిబిటర్లు అంటుంటే.. వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశంలో పర్సంటేజీ, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. ఈ మేరకు నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు. గతంలో పర్సంటేజ్ విధానాన్ని మూడు భాగాలుగా విభజిస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారు.

* 30 కోట్లు+ నైజాం హక్కులు కలిగిన సినిమాలకు మొదటి వారం 75 శాతం డిస్ట్రిబ్యూటర్, 25 శాతం ఎగ్జిబిటర్, రెండో వారం 55 శాతం డిస్ట్రిబ్యూటర్, 45 శాతం ఎగ్జిబిటర్, మూడో వారం 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్, నాలుగో వారం 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్.
* 10 కోట్ల నుంచి 30 కోట్ల వరకు నైజాం హక్కులు కలిగిన సినిమాలకు మొదటి వారం 60 శాతం డిస్ట్రిబ్యూటర్, 40 శాతం ఎగ్జిబిటర్, రెండో వారం 50 శాతం డిస్ట్రిబ్యూటర్, 50 శాతం ఎగ్జిబిటర్, మూడో వారం 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్, నాలుగో వారం 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్
* 10 కోట్ల లోపు నైజాం హక్కులు కలిగిన సినిమాలకు మొదటి వారం 50 శాతం డిస్ట్రిబ్యూటర్, 50 శాతం ఎగ్జిబిటర్, రెండో వారం 40 శాతం డిస్ట్రిబ్యూటర్, 60 శాతం ఎగ్జిబిటర్, మూడో వారం 30 శాతం డిస్ట్రిబ్యూటర్, 70 శాతం ఎగ్జిబిటర్‌కి ఉండేది.
* అలాగే పెద్ద, మీడియం సినిమాలకు 2 శాతం నేగోషియేషన్‌తో.. అంటే 73 శాతం డిస్ట్రిబ్యూటర్, 27 శాతం ఎగ్జిబిటర్ తీసుకునేలా నిర్ణయం తీసుకున్నారు.

# దానిపైనే ఆశలు



సూపర్ స్టార్ మహేశ్‌బాబుతో 1 నేనొక్కడినే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన అందాల భామ కృతి సనన్. ఐతే ఆ మూవీ కమర్షియల్‌గా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. ఆ తర్వాత తెలుగులోనే నాగ చైతన్యతో దోచెయ్ సినిమా చేసింది బ్యూటీ. అనంతరం బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడ వరుస ఛాన్స్‌లు అందుకుంది. 'హీరోపంటీ', 'బరేలీ కి బర్ఫీ', 'దిల్‌వాలే' వంటి చిత్రాల్లో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఓవైపు సినిమాలు, మరో వైపు వెబ్ సిరీస్‌లు ఇలా హిందీ ఆడియన్స్‌ని మెప్పిస్తూ వచ్చింది. 2021లో విడుదలైన 'మిమీ'కి గాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఐతే ఏమైందో ఏమో కానీ సడెన్‌గా ఈ అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోయింది. బాలీవుడ్ లో ముద్దుగుమ్మకు ఉన్న క్రేజ్ ని చూసే రెబల్ స్టార్ చేసిన ఆదిపురుష్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అందులో సీత పాత్రలో కృతి సనన్ ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ మూవీ కూడా డిజాస్టర్ కావడంతో ఈఅందాల భామ మరింత ఇబ్బందుల్లో పడింది. ఆదిపురుష్ తర్వాత మరో రెండు చిత్రాలు చేసినా లాభం లేకుండా పోయింది. ఐతే లాస్ట్ ఇయర్ వచ్చిన క్రూ సినిమాతో కాస్త బెటర్ అనిపించుకుంది కృతి సనన్. ప్రస్తుతం ఈఅమ్మడు తెరె ఇష్క్ మైన్ చిత్రంలో నటిస్తుంది. ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ మూవీతో మరోసారి బాలీవుడ్ లో తన స్టామినా ప్రూవ్ చేసుకోవాలని చూస్తుంది కృతి సనన్. అయితే ఈ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకుంది కృతి. మరోవైపు తప్పకుండా ఈ అమ్మడు తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# విజయ్ సేతుపతితో విశాల్

విజయ్ సేతుపతితో తాను కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ విశాల్ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని విశాల్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. 'నా ఫ్రెండ్ విజయ్ సేతుపతిని చాలాకాలం తర్వాత చెన్నై ఎయిర్ పోర్టులో కలిశా. అతడిని ఎప్పుడు కలిసినా ఆనందమే. కొన్ని నిమిషాలపాటే మేం మాట్లాడుకున్నా అదెంతో బాగుంది' అని పేర్కొన్నారు. విజయ్ కి ఆల్ ది బెస్ట్ చెప్పిన విశాల్.. ఆ నటుడిని త్వరలోనే మరోసారి కలవాలని ఆకాంక్షించారు. కాగా.. ఇటీవల తమిళనాడులోని విల్లుపురం జిల్లా కూవాగంలో నిర్వహించిన అందాల పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల్.. వేదికపైనే స్పృహ తప్పి పడిపోయిన సంగతి తెలిసిందే.





దుబాయ్ నుండి కీర్తి సురేష్ చీర లుక్ అభిమానులను బాగా ఆకట్టుకుంది

## సండే ఐపీఎల్ ట్రిపుల్ ధమాకా..
# రెండు మ్యాచులు.. మూడు బెర్తులు



చిన్న గ్యాప్ తర్వాత ఐపీఎల్ 2025 శనివారం ప్రారంభమైంది. అయితే తొలి మ్యాచ్ వర్షార్పణమైంది. దీంతో ఆదివారం నుంచి ఐపీఎల్ సందడి మొదలు కానుంది. సాధారణంగా ఆదివారం రెండు మ్యాచులతో డబుల్ ధమాకా ఉంటుంది. ఈ రోజు మాత్రం ట్రిపుల్ ధమాకా అని చెప్పాలి. ఎందుకంటే ఈ రోజు జరగబోయే రెండు మ్యాచులతో ప్లేఆఫ్స్‌లో ఒక బెర్తు అధికారికంగా, రెండు బెర్తులు దాదాపుగా ఖాయమైపోతాయి. శనివారం జరగాల్సిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో 17 పాయింట్లతో బెంగళూరు పాయింట్ల పట్టికలో తొలి స్థానానికి చేరుకుంది. ప్లేఆఫ్స్‌కి దాదాపు చేరుకుంది. ఆదివారం 3.30కి మొదలయ్యే మ్యాచ్‌లో మాంచి దూకుడు మీదున్న పంజాబ్ కింగ్స్ రాజస్థాన్ రాయల్స్‌ని ఓడిస్తే టాప్ 2లోకి వచ్చి ప్లేఆఫ్స్‌కి మరింత చేరువవుతుంది. ఈ రోజు 7.30కి దిల్లీ క్యాపిటల్స్‌తో జరగబోయే మ్యాచ్‌లో గుజరాత్ టైటన్స్ గెలిస్తే 18 పాయింట్లతో అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంటుంది. పై రెండు అంశాలు జరిగితే గుజరాత్, పంజాబ్‌తో పాటు బెంగళూరు కూడా ప్లేఆఫ్స్‌కు చేరినట్లే. అప్పుడు నాలుగో బెర్త్ కోసం ముంబయి ఇండియన్స్ (14 పాయింట్లు), దిల్లీ (13), లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (10) మధ్య పోటీ ఉంటుంది. ఆదివారం రెండో మ్యాచ్‌లో గుజరాత్ ఓటమిపాలైతే దిల్లీ 15 పాయింట్లతో టాప్ 4లోకి వస్తుంది. దాంతో ముంబయి పరిస్థితి క్లిష్టంగా మారుతుంది. తొలి మ్యాచ్‌లో పంజాబ్ ఓడిపోతే.. ఆ జట్టుకు తర్వాత 2 మ్యాచ్‌లు కీలకంగా మారతాయి.

# బుమ్రాపై భారం వద్దు.. టెస్టు కెప్టెన్సీపై రవిశాస్త్రి

దుబాయ్: భారత టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరన్న దానిపై అమితాసక్తి నెలకొంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఉండి, రెండు మ్యాచ్‌ల్లో జట్టును నడిపించిన బుమ్రాకే పగ్గాలు ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తుంటే.. భవిష్యత్ దిశగా యువ సారథి అవసరమన్న ఉద్దేశంతో శుభ్‌మన్ గిల్‌కు బాధ్యతలు అప్పగించాలనే వాదన మరోవైపు వినిపిస్తోంది. టీమ్‌ఇండియా మాజీ కోచ్, వ్యాఖ్యాత రవిశాస్త్రి సైతం బుమ్రాకు కెప్టెన్సీ ఇవ్వకపోతేనే మంచిదని అంటున్నాడు. శుభ్‌మన్‌తో పాటు పంత్ నాయకత్వ బాధ్యతలకు సిద్ధంగా ఉన్నారని అతను అభిప్రాయపడ్డాడు. ''ఆస్ట్రేలియా సిరీస్ చూశాక బుమ్రానే కెప్టెన్సీకి సరైన వాడని నాకూ అనిపించింది. కానీ బుమ్రాను సారథిగా చేస్తే బౌలర్‌గా అతణ్ని కోల్పోతాం. ఒక్కో మ్యాచ్ చూసుకుని ఆడాల్సిన స్థితిలో అతనున్నాడు. తీవ్ర గాయం తర్వాత కోలుకుని ఇప్పుడే అందుబాటులోకి వచ్చాడు. ఐపీఎల్ ఆడుతున్నాడు. అం దులో వేసేది నాలుగు ఓవర్లే. తర్వాత టెస్టుల్లో 1015 ఓవర్లు బౌలింగ్ చేయడం మొదలుపెడతాడు. కానీ కెప్టెన్సీ తాలూకు ఒత్తిడి అతడి బుర్రపై పడడం మంచిది కాదు. కెప్టెన్‌గా తీర్చిదిద్దడానికి శుభ్‌మన్ మంచి ఎంపికే. అతడికో అవకాశం ఇవ్వండి. తనకిప్పుడు 25 ఏళ్లే కాబట్టి ఎదగడానికి అవకాశముంటుంది. పంత్ రూపంలో మరో ప్రత్యామ్నాయం కూడా ఉంది. వయసు రీత్యా వీళ్లిద్దరూ ఇంకో దశాబ్దం పాటు ఆడే అవకాశముంది. ఐపీఎల్‌లో కెప్టెన్లుగా అనుభవం కూడా సంపాదించారు'' అని రవిశాస్త్రి అన్నాడు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.